# ఎప్‌సెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

- జనగామ విద్యార్థినికి రాష్ట్రస్థాయి 64వ ర్యాంక్
- సత్తాచాటిన ఏబీవీ జూనియర్ కాలేజీ విద్యార్థులు


వేల్పుల స్నిగ్ధ

జనగామ (నమస్తే తెలంగాణ)/దేవరుప్పుల, మే 11 : టీఎస్ ఎప్‌సెట్–2025 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా కేంద్రానికి చెందిన బొగ్గారపు సాయి సంయుక్త (211C02110) ఎప్‌సెట్ (అగ్రికల్చర్–ఫార్మసీ)లో రాష్ట్రస్థాయిలో 64వ ర్యాంకు సాధించగా, ఏబీవీ జూనియర్ కాలేజీ విద్యార్థులు పలువురు రాష్ట్ర స్థాయి ర్యాంకులతో సత్తాచాటారు. రాజబోయిన మధుమిత (316వ ర్యాంకు), చెన్నోజు దేవిశ్రీ (1,886వ ర్యాంకు), మంగ మౌనిక (2,734వ ర్యాంకు), ఎంజెల్‌గ్రేస్ (8,387వ ర్యాంకు, పాశికంటి వర్షిత్ (9,485వ ర్యాంకు), మహ్మద్ అబ్దుల్ ఖదీర్ (9,726 ర్యాంకు) సాధించగా, మరికొందరు విద్యార్థులు 20వేల లోపు ర్యాంకులు సాధించారు. దీంతో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను అభినందించారు. దేవరుప్పుల మండలం సీతారాంపురానికి చెందిన పోరండ్ల సైదమ్మ కుమారుడు పోరండ్ల శివగణేశ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 991 మార్కులు పొందగా, ఎప్‌సెట్‌లో 2,124 ర్యాంకు సాధించాడు. దేవరుప్పులకు చెందిన వేల్పుల చంద్రప్రకాశ్ కూతురు వేల్పుల స్నిగ్ధ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 986 మార్కులు పొందగా, ఎప్‌సెట్‌లో 3,961 ర్యాంకు సాధించింది.

## కష్టాలను ఎదురీది కొడుకును చదివిస్తూ..

- ఫిట్స్‌తో భర్త దూరమైనా అన్నీతానైన తల్లి సైదమ్మ
- ఎప్‌సెట్ ఫలితాల్లో కుమారుడు శివగణేశ్‌కు 2,124 ర్యాంకు
- త్వరలో ప్రయోజకుడై అండగా నిలుస్తాడని ఆకాంక్ష


పోరండ్ల సైదమ్మ


పోరండ్ల శివగణేశ్

దేవరుప్పుల, మే 11: భర్త చనిపోవడంతో ఆమే అన్నీ తానై కొడుకును చదివించింది. దీంతో అతడు ఎప్‌సెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించాడు. సీతారాంపురానికి చెందిన పోరండ్ల సైదమ్మ భర్త శ్రీనివాస్‌కు ఫిట్స్ ఉండటంతో పదమూడేళ్ల క్రితం వ్యవసాయ పనులకు వెళ్లి పొలంలోనే మృతిచెందాడు. వారి ఒక్కగానొక్క కొడుకు శివగణేశ్‌కు నాడు ఐదేళ్ల వయస్సు. నాటి నుంచి తల్లి ఎంతో కష్టపడి చదివించింది. దేవరుప్పులలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో వేసి, అందులోనే ఆయా పనికి కుదిరింది. తల్లి పట్టుదల, తండ్రి లేకపోవడంతో శివగణేశ్ బాగా చదివి పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించాడు. పాఠశాల చదువు పూర్తవడంతో కొడుకు ఇంటర్ చదువు కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. ఇండ్లలో పనిచేస్తూ ఇంటర్ ఓ ప్రైవేట్ కళాశాలలో చదివించింది. ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో 991 మార్కులు పొందిన శివగణేశ్ ఆదివారం ఎప్‌సెట్ ఫలితాల్లో 2,124 ర్యాంకు సాధించాడు. మరోవైపు జేఈఈ మెయిన్ ఫలితాల్లో 92 పర్సంటైల్ సాధించినట్లు అతడు తెలిపాడు. 'ఇప్పటివరకు ఎన్నో కష్టాలు పడి చదివించానని, మరెన్ని కష్టాలు వచ్చినా పైచదువులు చదివిస్తా' అని తల్లి పోరండ్ల సైదమ్మ తెలిపింది.

# అధికార పార్టీ వారికే కాంటాలు

- కొనుగోలు కేంద్రాల్లో రాజకీయాలు
- రైతుల వడ్లు మాయిశ్చర్ వచ్చినా కాంటా పెట్టని నిర్వాహకులు
- 20 రోజులుగా రైతుల పడిగాపులు
- సీరియల్ రాలేదంటూ దాటవేత
- అకాల వర్షం, లారీల కొరతతో ఆందోళన
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు


పాలకుర్తి: గూడూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాసులు


చిల్పూరు: కృష్ణాజిగూడెంలో కల్లంలోనే ఉన్న వడ్లు


పాలకుర్తి: మార్కెట్‌లో ధాన్యం పోసి కాంటా కోసం ఎదురుచూస్తున్న రైతు బెల్లి దిలీప్

పాలకుర్తి, మే 11: అధికార పార్టీ లేదా ఎమ్మెల్యే మనిషైతే చాలు.. మండల స్థాయి నాయకుడు ఫోన్ చేస్తే వెంటనే ధాన్యం కాంటాలు అవుతాయి. కొనుగోలు కేంద్రం నిర్వాహకులే దగ్గరుండి మరీ కాంటాలు పెట్టిస్తున్నారు. ఎవరూ తెలియని రైతా.. అయితే కాంటాల కోసం కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు కాయాల్సిందే. ధాన్యం మ్యాచర్ వచ్చినా, 20రోజులు గడుస్తున్నా కాంటాలు పెట్టరు. ఇదేమిటని నిర్వాహకులను రైతులు ప్రశ్నిస్తే సీరియల్ రావాలంటూ సమాధానం. ఓ వైపు అకాల వర్షం.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల రాజకీయం.. ఇంకోవైపు లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాలకుర్తి మండల కేంద్రంలో ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 20రోజుల క్రితం పాలకుర్తికి చెందిన సామాన్య రైతు బెల్లి దిలీప్ ధాన్యం పోశాడు. అతడి సీరియల్ కూడా వచ్చింది. కానీ కాంటా పెట్టకుండా నిర్వాహకులు పాలకుర్తి పట్టణానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ భర్త, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య ధాన్యంతోపాటు అతడి కుమారుల ధాన్యాన్ని సీరియల్ రాకున్నా నిబంధనలకు విరుద్ధంగా కాంటాలు పెట్టారని రైతు దిలీప్ ఆరోపించాడు.

కాగా, మండలంలోని గూడూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు కాంటాల్లో రాజకీయం చేస్తున్నారని రైతు నక్క నాగయ్య ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాను ధాన్యాన్ని తన బావి వద్దే ఆరబోసి మాయిశ్చర్ వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చానని తెలిపాడు. గత నెల 20వ తేదీన కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోయగా 21రోజులు గడుస్తున్నా నిర్వాహకులు కాంటా పెట్టలేదని ఆవేదన చెందుతున్నాడు. నిర్వాహకులేమో సీరియల్ రాలేదంటున్నారని, అకాల వర్షాలు కురుస్తున్నాయని ఆవేదన చెందాడు. లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాసులు పేరుకుపోయాయి. అధికారులు నామమాత్రంగా తనిఖీ చేస్తున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి త్వరగా కాంటాలు అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

### కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన వడ్లు

చిల్పూరు: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కృష్ణాజిగూడెం, చిల్పూరు, శ్రీపతిపల్లి, పల్లగుట్టలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోయాయని పేర్కొన్నారు. కృష్ణాజిగూడెం కొనుగోలు కేంద్రంలో 20రోజులుగా రైతులు పడిగాపులు పడుతున్నారని తెలిపారు. లారీలు రాక, మిల్లులకు వెళ్లిన లారీల్లో ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోకుండా యజమానులు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాలు త్వరగా దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


ఆలయ ఈవో వంశీ వివాహ వేడుకలో పాల్గొన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## వధూవరులకు 'పల్లా' ఆశీర్వాదం

బచ్చన్నపేట, మే 11 : మండలంలోని సిద్దేశ్వరస్వామి ఆలయ ఈవో చిందం వంశీ, మండలంలోని బండనాగారానికి చెందిన మలిపెద్ది యాకులు కుమార్తె శ్రీహిత వివాహం ఆదివారం జనగామలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు చిగురు నవీన్ వివాహ వేడుకల్లో పల్లా పాల్గొని కొత్త జంటను దీవించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు బావండ్ల కృష్ణంరాజు, పూర్ణచందర్, కొండి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, కర్ణాకర్, ప్రతాపరెడ్డి, రాజనర్సు, జనార్దన్, కనుకయ్య, ముశిని రాజుగౌడ్, కోనేటి స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, డైరెక్టర్లు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, వెంకటయ్య, రామకృష్ణ, రాజయ్య, శివరాములు, భాస్కర్, అర్చకులు ఓంనమశ్శివాయ, సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, భానుప్రకాశ్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### హనుమాన్ స్వాముల ప్రత్యేక పూజలు


భిక్ష చేస్తున్న హనుమాన్ స్వాములు

బచ్చన్నపేట, మే 11 : మండలంలోని కేశిరెడ్డిపల్లితోపాటు అలీంపూర్ గ్రామాల్లో హనుమాన్ మాల ధారణ చేసిన స్వాములు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రోజూ ఉదయం తెల్లవారుజామున ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఊరంతా పాడిపంటలతో, సస్యశ్యామలంగా ఉండేలా దీవించమని ఆంజనేయస్వామి వేడుకుంటున్నారు. ఆదివారం గ్రామంలోని జక్కుల లక్ష్మి, లింగం దంపతుల కుమారుడు భరత్ – ప్రవళ్లిక ఇంట్లో హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

### బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత

చిల్పూరు, మే 11 : మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు ఎడ్ల యాకమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పార్టీ సభ్యత్వం ఉన్నందున రూ.2లక్షల బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాకమ్మ పార్టీ కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజవరం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా, పార్టీ మండల నాయకులు ఎడ్ల శ్రీనివాస్, వెంకటస్వామి, మహిపాల్, రాజేశ్, చిల్పూరు మండల బేడ బుడిగ జంగాల మండల అధ్యక్షుడు మోటం రాజు, సాయి, ఉడుత అశోక్, రవీందర్ పాల్గొన్నారు.


రాజవరంలో చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

### 'భూమాత' జిల్లా కోశాధికారిగా దుంపల పద్మారెడ్డి



స్టేషన్ ఘన్‌పూర్, మే 11 : భూమాత సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారిగా దుంపల పద్మారెడ్డిని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సోమయ్య యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన రైతు దుంపల పద్మారెడ్డిని భూమాత సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారిగా నియమించగా జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరి ఆయనకు నియామక పత్రాన్ని అందించారు.


దేవరుప్పుల: బీఆర్ఎస్ నాయకుడు దయాకర్‌రెడ్డి కూతురు వివాహానికి హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

### వివాహ వేడుకలకు ఎర్రబెల్లి హాజరు

దేవరుప్పుల/ పాలకుర్తి, మే 11: పలు వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాసర్ల దయాకర్‌రెడ్డి కూతూరు తేజస్వినీరెడ్డి – భరత్‌కుమార్‌రెడ్డి, ధర్మాపురంలో అజ్మీరా బిక్కునాయక్ కుమారుడి వివాహం జరగ్గా వారిని ఆశీర్వదించి కానుకలు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల నాయకులు పల్లా సుందరరాం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి, బస్వ మల్లేశ్, కారుపోతుల భిక్షపతి, ఇంటి సంజీవరెడ్డి, కొత్త జలేందర్‌రెడ్డి, మలిపెడ్డి శ్రీనివాసరెడ్డి, కుతాటి నర్సింహులు, గడ్డం రాజు, చినబుచ్చిరెడ్డి, చిత్తరంజన్‌రెడ్డి, ఎడమ నర్సింహారెడ్డి, సోమరాజ్ ఉన్నారు. కాగా, పాలకుర్తి మండలం దర్దేపల్లికి చెందిన వేల్పుల సోమనర్సయ్య – ఎల్లమ్మ దంపతుల కుమారుడు మదార్ – రాజేశ్వరి వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. శివం గార్డెన్‌లో అనంతోజు సోమలింగాచారి కుమారుడు హరీశ్, బమ్మెరకు చెందిన రాపోలు తిరుపతి కుమార్తె వివాహ వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, తాజా మాజీ ఎంపీపీ నల్లానాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు ఇమ్మడి ప్రకాశ్, పాము శ్రీనివాస్, సంగి పర్శరాములు, వేణిధర్‌రావు, తాడేం రవి, ఇంతల కృష్ణమూర్తి ఉన్నారు.

### ఆర్యవైశ్యులు సామాజిక సేవలో ముందుండాలి


ఆర్యవైశ్య భవనాన్ని ప్రారంభిస్తున్న చారగొండ్ల ప్రసాద్, కార్యవర్గం

పాలకుర్తి, మే 11: ఆర్యవైశ్యులు వ్యాపారంతోపాటు సామాజిక సేవలో ముందుండాలని ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు చారగొండ్ల ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని గూడూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని మండల ప్రధాన కార్యదర్శి తమ్మి రాంబాబు, గ్రామ అధ్యక్షుడు పట్టూరి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఐక్యంగా ఉండి సమస్యలపై ఉద్యమించాలన్నారు. పేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని సూచించారు. ఆర్యవైశ్యులకు పాలకుర్తిలో త్వరలోనే భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఆర్యవైశ్యులకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాగమల్ల సోమన్న, రాపాక రఘు, గజ్జి సంతోష్‌కుమార్, చారగొండ్ల శివ, మారం శ్రీనివాస్, నంగునూరి రవీందర్, బోనగిరి కృష్ణమూర్తి, పట్టూరి రాకేశ్, గందె పుల్లయ్య, బాబూరావు, బొగ్గారపు నాగరాజు, దొడ్డ వెంకన్న, చీదర జగదీశ్ పాల్గొన్నారు.

### ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

- పాల్గొన్న లింగాలఘనపురం, బండ్లగూడెం భక్తులు
- రెండు గ్రామాల్లోనూ ఊరేగింపు

లింగాలఘనపురం, మే 11: లింగాలఘనపురం – బండ్లగూడెం గ్రామాల మధ్య బండగుట్టపై లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య లింగాలఘనపురం గడీ నుంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మరో ట్రాక్టరులో పద్మశాలీలు మగ్గాన్ని అమర్చి పట్టు వస్త్రాన్ని ఊరేగింపులోనే నేశారు. ట్రాక్టర్లు బండ్లగూడెం చేరుకోగా ప్రధాన వీధుల్లోనూ ఊరేగింపు కొనసాగించారు. బండ్లగూడెం నుంచి బండగుట్టపైకి చేరుకునే సరికి పద్మశాలీలు పట్టువస్త్రాల తయారీ పూర్తయ్యింది. నేసిన పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించి పూజలు చేశారు. సంపత్‌కుమార కృష్ణమాచార్యులు నేతృత్వంలో కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. కార్యక్రమాల్లో లక్ష్మీనరసింహాచార్యులు, లింగాల దీపక్‌రెడ్డి, లింగాల సింధు, వంచ మహేశ్వర్‌రెడ్డి, వంచ రాంరెడ్డి, కేమిడి భిక్షపతి, ఏదునూరి వీరన్న, కేమిడి యాదగిరి, నేత కార్మికులు బింగి స్వామి, కారంపురి చంద్రయ్య, వంగ ఉప్పలయ్య, మహేశ్వరం నరసింహులు, నాయకులు కేలపు లక్ష్మీనారాయణ, మల్గ శ్రీశైలం పాల్గొన్నారు.


లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


నర్మెట: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


చిల్పూరు: చిన్నపెండ్యాలలో పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

నర్మెట, మే 11: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 2006–07లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు నిమ్మ వాసుదేవరెడ్డి, రవిశంకర్, రామ్మూర్తి, పి.లక్ష్మి, నీరజ, రవి, తిరుపతయ్య, అన్వర్‌సుల్తానా, శ్రీరాములు పాల్గొన్నారు.

**చిన్నపెండ్యాలలో..**

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982–83 పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు చాడ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, ప్రస్తుత హెచ్‌ఎం సంపత్ కుమార్‌ను సన్మానించారు. గజ్జెల దామోదార్, కీర్తి ప్రభాకర్, నల్లనాల సుధాకర్, ఎండీ రబ్బానీపాషా, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, గుంపుల భారతిరెడ్డి, మాల్లారెడ్డి, స్వామి, శంకర్, రాజేందర్, రమేశ్, కొమురయ్య, రాజయ్య, ఇంద్రాణి, సంజీవరాణి, సంధ్యరాణి పాల్గొన్నారు.

## కాల్వ పనులు సకాలంలో పూర్తి చేయాలి

**స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం**


కంచనపల్లి వద్ద కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి, మే 11: సాగునీటి కాల్వ పనులను సకాలంలో పూర్తి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని కంచనపల్లి, శ్రీమన్నారాయణపురంలో స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేటకు వెళ్లే ప్రధాన కాల్వ పనులను ఆదివారం పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని కంచనపల్లిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీటి కాల్వలో పిచ్చి మొక్కలు, మట్టి పేరుకుపోయిందని, కాల్వ పనులు పూర్తి చేసి రెండు పంటలకు సాగు నీరు అందిస్తామన్నారు. కంచనపల్లి నుంచి భాంజీపేట వరకు త్వరలోనే బీటీ రోడ్డు మంజూరు చేస్తానని అన్నారు. దోనెబండ నుంచి కమలపూర్ వరకు అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కంచనపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఐత జయరాములు, మాజీ జడ్పీటీసీలు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి, బొల్లం అజయ్, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, మండల అధ్యక్షుడు కొళ్ల రవిగౌడ్, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ సుధీర్, ఈఈ వనయ్ బాబు, డీఈ రామకృష్ణ, మేకల నరేందర్, రాపోలు రామ్మూర్తి, ఈశ్వరయ్య, లింగాజీ, తిప్పారపు రవీందర్, బోనాసి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

దేవరుప్పుల, మే 11: సీతారాంపురం హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం విద్యార్థులక కెరీర్ గైడెన్స్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ అంబటి యాకన్న ఆధ్వర్యంలో గౌడ కమ్యూనిటీ హాల్‌లో ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి సతీష్ అధ్యక్షత వహించగా చైతన్య యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి రిసోర్స్‌పర్సన్‌గా విద్యార్థులకు భవిష్యత్తు చదువులపై విలువైన సమాచారాన్ని తెలియజేశారు. విద్యార్థులు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు. ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు కోసం ఏ కోర్సులు తీసుకోవాలనేది వివరించారు. కాగా, పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందించి సన్మానించారు. విలువైన సమాచారం అందించిన ప్రొఫెసర్ రాజేందర్‌రెడ్డిని ట్రస్ట్ ఉపాధ్యక్షుడు హనుమాన్‌జీ సత్కరించారు. అంతకుముందు ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన భారత జవాన్ల కోసం నిమిషం పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. గ్రామంలోని ప్రేమసదనం అనాథ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు ట్రస్ట్ సభ్యుడు పోరండ్ల శ్రీనివాస్ అన్నదానం చేశారు. ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు కోశాధికారి ఆవుల రాజు, సంయుక్త కార్యదర్శులు బస్వ నాగరాజు, దొడ్డి రమేశ్, పుప్పాల సోమేశ్, బాషిపాక సుధాకర్, సభ్యులు అనంతుల శివకుమార్, పెండెం ఉపేందర్, బస్వ మల్లేశం పాల్గొన్నారు.


ఉత్తమ విద్యార్థులను సన్మానిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

### పదో తరగతి విద్యార్థులకు సత్కారం

స్టేషన్ ఘన్‌పూర్, మే 11 : స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి శివునిపల్లిలో పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి శాగ సురేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత కార్యదర్శి గోరంట్ల యాదగిరి హాజరయ్యారు. పదో తరగతి ఫలితాల్లో శివునిపల్లి గ్రామ ముదిరాజ్ విద్యార్థులు రేగుల హాస్య(550), చెన్నూరి శ్వేత(549), గోరంట్ల హర్షవర్ధన్(514) మార్కులు సాధించారు. వీరిని శాలువాతో సత్కరించి నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా యాదగిరి, సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతంతో మొదటి వరుసలో ముదిరాజ్ కులస్తులు నిలిచారని, సంఖ్య బలంగా చూసినా, చదువుల్లో చూసినా ముదిరాజ్‌లు ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. కానీ ఉద్యోగ నియామకాల్లో వెనకబడుతున్నారని, రిజర్వేషన్లలో ముదిరాజ్‌లు బీసీ డీలో ఉండటమే ఇందుకు కారణమని తెలిపారు. ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరారు. శివునిపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నూరి వెంకటేశ్వర్లు, ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు పిట్టల అనిల్, సహాయ కార్యదర్శి రేగుల రాకేశ్, ఆర్గనైజర్లు నీల శివలింగం, పిట్టల రమేశ్, యూత్ సభ్యులు పిట్టల అజయ్, రేగుల శ్రీకాంత్, బూర్ల తిరుపతి దారం నాగరాజ్, సంఘం సభ్యులు రేగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న ముదిరాజ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

### విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వ చెలగాటం

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమ**


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగోని సుమ

దేవరుప్పుల, మే 11: పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగోని సుమ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని ప్రైవేట్ విద్యాసంస్థలు పట్టుదలతో ఉన్నాయని, మరోవైపు ఫీజులు చెల్లించిన విద్యాసంస్థలకు పరీక్షలు నిర్వహిస్తామని యూనివర్సిటీలు చెబుతున్నాయని, దీంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడని అందాలపోటీల నిర్వహణకు రూ. 200కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### నేటి నుంచి ఐనవోలులో మహాకుంభాభిషేకం

ఐనవోలు, మే 11 : ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ఆవరణలోని ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠా పూర్వక ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం నుంచి ఈ నెల 14 వరకు నిర్వహించనున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం, మంగళవారాలు ప్రత్యేక పూజలు నిర్వహించి, బుధవారం ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవోతోపాటు ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ కోరారు.

### రేపు పాలీసెట్

హనుమకొండ చౌరస్తా, మే 11 : ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడేళ్ల ఇంజినీరింగ్, నాన్–ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతోపాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం జరిగే పాలీసెట్–2025ను ఈ నెల 13న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని 12 కేంద్రాల్లో 6,424 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 10 గంటల నుంచే అనుమతిస్తారని, విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ, 2బీ బ్లాక్ పెన్సిల్, ఎరేసర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తీసుకొని రావాలని, 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే పాస్‌పోర్టు సైజు ఫొటో, ఐడీ ప్రూఫ్(ఆధార్ కార్డు) తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**గోదాం కావలెను**

★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500–2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590.
NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565